సాక్షి తూర్పుగోదావరి

ఆదివారం । 2 । జూన్ । 2024



నిబంధనలు అతిక్రమిస్తే కేసులే..

ఈ నెల 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు తప్పవని ఏలూరు రేంజ్ శాంతిభద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రవిప్రకాష్ హెచ్చరించారు.

8లో



సత్యదేవుని రథానికి రక్షణ

అన్నవరం సత్యదేవుని నూతన టేకు రథానికి అధికారులు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. 'తేరుకు రక్షణ ఈ తీరునా?' శీర్షికన 'సాక్షి' ప్రచురించిన కథనానికి వారు స్పందించారు.

గరిష్టం/కనిష్టం
40.0°/30.0°

	గరిష్టం	కనిష్టం
రాజమహేంద్రవరం	40.5	30.0
కాకినాడ	32.8	24.0
అమలాపురం	39.0	29.0

న్యూస్‌రీల్

అధినేతకు ఆత్మీయ స్వాగతం



సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న మంత్రి వేణు

రాజమహేంద్రవరం రూరల్: విదేశీ పర్యటన ముగించుకుని శనివారం తెల్లవారుజామున రాష్ట్రానికి తిరిగి వచ్చిన ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ఆత్మీయ స్వాగతం పలికారు. సీఎం జగన్‌కు గన్నవరం విమానాశ్రయంలో పుష్పగుచ్ఛం అందజేశారు.

61,002 మందికి ఇంటింటికీ పింఛన్లు

రాజమహేంద్రవరం రూరల్: ఇంటింటికీ సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో 90 శాతం లక్ష్యాన్ని సాధించామని జిల్లా కలెక్టర్ కె.మాధవీలత ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,42,300 మంది పెన్షన్ లబ్ధిదారులు ఉండగా వారిలో ప్రత్యేక కేటగిరీ పరిధిలో ఇంటింటికీ వెళ్లి పింఛన్లు అందించాల్సిన వారు 67,810 మంది ఉన్నారని పేర్కొన్నారు. వీరికి రూ.19.57 కోట్లు అందించాల్సి ఉండగా.. శనివారం రాత్రి 8 గంటల వరకూ 61,002 మందికి రూ.17.62 కోట్లు పంపిణీ చేశామని వివరించారు. మొత్తం 1,74,490 మంది బ్యాంకు ఖాతాల్లో రూ.52.35 కోట్లు జమ చేయాల్సి ఉండగా, ఇప్పటి వరకూ 83,438 మందికి రూ.26.03 కోట్లు అందించామని తెలిపారు. మిగిలిన వారికి ఆదివారం పంపిణీ చేస్తామని కలెక్టర్ మాధవీలత తెలిపారు.

విత్తన దుకాణాలపై విజిలెన్స్ దాడులు



స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గొల్లప్రోలు: స్థానికంగా విత్తన, పురుగు మందుల దుకాణాలపై రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఎస్ఎస్‌పీ సుబ్బారెడ్డి (ఐపీఎస్) ఆధ్వర్యాన శనివారం దాడులు జరిగాయి. విజిలెన్స్, వ్యవసాయ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి శ్రీ శివ ఏజెన్సీ, స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో తనిఖీలు చేశారు. స్రవంతి ఆగ్రో ఏజెన్సీస్‌లో స్టాక్ రిజిస్టర్ సక్రమంగా నిర్వహించకపోవడంతో సుమారు రూ.1,49,472 విలువైన పత్తి విత్తనాల విక్రయాలు నిలుపు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎస్‌పీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ, రాజమహేంద్రవరం రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ పరిధిలోని మూడు జిల్లాల్లో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో నిరంతరం తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ అధికారులు ముత్యాల నాయుడు, శ్రీనువాసరెడ్డి, భార్గవ మహేష్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనకు 163 మంది హాజరు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోని పాలిసెట్ హెల్ప్ లైన్ కేంద్రంలో శనివారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలనకు 163 మంది హాజరయ్యారని జిల్లా కో ఆర్డినేటర్, ప్రిన్సిపాల్ వి.నాగేశ్వరరావు తెలిపారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం ధృవీకరణ పత్రాలను అందజేశామన్నారు. 92,001 నుంచి 1,08,000 వరకూ ర్యాంకు గల విద్యార్థులు ఆదివారం హాజరుకావాలని కోరారు.

అప్పనపల్లి క్షేత్రం.. ఆధ్యాత్మిక పరవశం

మామిడికుదురు: అప్పనపల్లి క్షేత్రానికి శనివారం వేలాదిగా భక్తులు తరలివచ్చారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువుదీరిన శ్రీబాల బాలాజీ స్వామి దివ్య మంగళ స్వరూపాన్ని చూసి పరవశులయ్యారు. కొత్త ఆలయంతో పాటు పాత గుడిలో కొలువైన స్వామిని దర్శించుకున్నారు. 3,849 మంది భక్తులు రాగా, 3,061 మంది అన్న ప్రసాదం స్వీకరించారని చెప్పారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,17,050 ఆదాయం లభించింది. నిత్యాన్న దాన ట్రస్టుకు రూ.53,540 విరాళాలుగా వచ్చాయని ఆలయ కార్యనిర్వహణాధికారి గ్రంధి మాధవి తెలిపారు. ఆలయానికి వివిధ సేవల ద్వారా రూ.2,70,590 ఆదాయం సమకూరిందన్నారు.

కౌంటింగ్‌కు రెడీ

- 4న నన్నయ వర్సిటీలో ఓట్ల లెక్కింపు
- పూర్తయిన ఏర్పాట్లు
- ఉదయం 8 గంటలకు ప్రారంభం
- మధ్యాహ్నం 2 గంటల్లోపు పూర్తి
- విజేతలకు సాయంత్రం 6 గంటలకు డిక్లరేషన్ అందజేత
- ప్రశాంతంగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి
- కలెక్టర్ మాధవీలత, ఎస్పీ జగదీష్ విజ్ఞప్తి



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మాధవీలత. చిత్రంలో ఎస్పీ జగదీష్, జేసీ తేజ్‌భరత్

సాక్షి, రాజమహేంద్రవరం: రాజానగరం సమీపంలోని ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఈ నెల 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు చేపట్టేందుకు జిల్లా అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ఈ ప్రక్రియను విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.మాధవీలత, ఎస్పీ పి.జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఓట్ల లెక్కింపునకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని, బందోబస్తు కట్టుదిట్టం చేశామని వెల్లడించారు. ఓట్ల లెక్కింపు విధి విధానాలు, ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు జిల్లాలో చేపట్టిన ఏర్పాట్లను కలెక్టరేట్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు వెల్లడించారు. ఆ వివరాలు వారి మాటల్లోనే..

పోస్టల్ బ్యాలెట్లతో ప్రారంభం

రాజమండ్రి లోక్‌సభ, రాజమండ్రి సిటీ, రాజమండ్రి రూరల్ నియోజకవర్గాల పరిధిలో ఉదయం 8 గంటలకే పోస్టల్ బ్యాలెట్, ఎలక్ట్రానికల్లీ ట్రాన్స్‌మిటెడ్ పోస్టల్ బ్యాలెట్ సిస్టమ్ (ఈటీపీబీఎస్ – సర్వీసు ఓట్లు), ఈవీఎం ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుంది. కొవ్వూరు, గోపాలపురం, నిడదవోలు, అనపర్తి, రాజానగరం నియోజకవర్గాల కౌంటింగ్ కేంద్రాల్లో పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉదయం 8 గంటలకు, ఈవీఎం ఓట్ల లెక్కింపు 8.30 గంటలకు ప్రారంభిస్తారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. రెండు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేస్తారు. మొత్తం ఓట్ల లెక్కింపు ప్రక్రియను మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి చేస్తారు.

పార్లమెంటరీ నియోజకవర్గ ఈవీఎం ఓట్ల లెక్కింపునకు 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. 116 రౌండ్లలో లెక్కింపు పూర్తి చేయనున్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎం ఓట్ల లెక్కింపునకు మరో 98 టేబుళ్లు ఏర్పాటు చేశారు. వీటిని కూడా 116 రౌండ్లలో పూర్తి చేస్తారు. ఈటీపీబీఎస్, పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపునకు ప్రత్యేకంగా 18 టేబుళ్లు ఏర్పాటు చేశారు. ఓట్ల లెక్కింపునకు సంబంధించి అసెంబ్లీ స్థానాలకు 7, పార్లమెంటరీ నియోజకవర్గానికి 7, పోస్టల్ బ్యాలెట్లకు 3 (ఒకటి పార్లమెంట్, రెండు అసెంబ్లీ) చొప్పున హాల్స్ ఏర్పాటు చేశారు.

2,500 మంది సిబ్బంది

ఓట్ల లెక్కింపునకు ఏడుగురు సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్‌ఓ), 119 మంది సూపర్‌వైజర్లు, 126 మంది సహాయకులు, 140 సూక్ష్మ పరిశీలకులు, 119 మంది ఇతర సిబ్బందిని నియమించారు. వివిధ స్థాయిల్లో మొత్తం 2,500 మంది సిబ్బంది కౌంటింగ్ విధుల్లో పాల్గొంటున్నారు.

2.30 గంటలకు ఫలితాల వెల్లడి

ఈవీఎం ఓట్ల లెక్కింపు తొలి రౌండ్‌కు అరగంట సమయం పడుతుంది. రెండో రౌండ్ నుంచి 20 నిమిషాలు మాత్రమే తీసుకుంటుంది. కొవ్వూరు నియోజకవర్గం ఓట్లను 13, రాజమండ్రి రూరల్ ఓట్లను 20 రౌండ్లలో లెక్కిస్తారు. జిల్లావ్యాప్తంగా 15,249 పోస్టల్ బ్యాలెట్ ఓట్లున్నాయి. వీటి లెక్కింపు మధ్యాహ్నం 12 గంటలకు, ఈవీఎం ఓట్ల లెక్కింపు మధ్యాహ్నం 2 గంటలకు పూర్తి చేసేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మరో అరగంట పాటు వీవీ ప్యాట్ స్లిప్పులను ర్యాండమ్‌గా లెక్కిస్తారు. ఫలితాలపై 2.30 గంటలకు స్పష్టత ఇస్తారు. గెలుపొందిన అభ్యర్థికి సాయంత్రం 6 గంటలకు డిక్లరేషన్ ఇస్తారు.

144 సెక్షన్ అమలు

కౌంటింగ్ ప్రాంతమైన నన్నయ యూనివర్సిటీ ఆవరణలో కిలోమీటరు పరిధిలో 144 సెక్షన్, 30 పోలీస్ యాక్ట్ అమలు చేస్తున్నారు. హింసాత్మక ఘటనలకు పాల్పడినా, ప్రేరేపించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. ఇప్పటి వరకూ 130 మందిపై కేసులు నమోదు చేశారు. కౌంటింగ్ కేంద్రాల వద్ద 1,500 పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు. మరో రెండు కంపెనీల కేంద్ర బలగాలు జిల్లాకు రానున్నాయి. ఇప్పటి వరకూ 162 సమస్యాత్మక గ్రామాలను గుర్తించి, వాటిపై నిఘా పెట్టారు. 10 డ్రోన్ కెమెరాల ద్వారా నిరంతర నిఘా ఏర్పాటు చేశారు. నన్నయ యూనివర్సిటీ వద్ద సుమారు 2.5 కిలోమీటర్ల పరిధిలో 'నో డ్రోన్ ఫ్లయ్ జోన్'గా ప్రకటించారు. ఎవరైనా డ్రోన్ ఎగురవేస్తే కేసులు నమోదు చేస్తారు. కౌంటింగ్ సెంటర్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది కెమెరా, సెల్‌ఫోన్, పెన్ కెమెరా వంటి ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకుని వెళ్లకూడదు. నిర్దేశిత ప్రాంతంలో డిపాజిట్ చేశాకే, కౌంటింగ్ కేంద్రం లోపలకు వారిని అనుమతిస్తారు. ఎవ్వరూ మద్యం తాగి రాకూడదు. ప్రతి ఒక్కరినీ బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షించిన తర్వాతే లోపలకు పంపిస్తారు.

ర్యాలీలు, సంబరాలు నిషేధం

ఎగ్జిట్ పోల్స్, కౌంటింగ్ అనంతరం జూన్ 6వ తేదీ వరకూ సమూహాలుగా ఏర్పడటం, ర్యాలీలు నిర్వహించడం, బాణసంచా కాల్చడాన్ని నిషేధించారు. వీటితో పాటు సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే ప్రకటనలు, వ్యాఖ్యలు చేసినా కేసులు నమోదు చేస్తారు.

పార్కింగ్ ప్రదేశాలు

- కౌంటింగ్ కేంద్రాలకు వచ్చే సిబ్బంది, ఏజెంట్లు, అభ్యర్థులు, పోలీస్ అధికారులు, సిబ్బందికి ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించారు.
- రాజమహేంద్రవరం వైపు నుంచి వచ్చే అన్ని రాజకీయ పార్టీల కౌంటింగ్ ఏజెంట్లు తమ వాహనాలను దివాన్ చెరువు ఫ్రూట్ మార్కెట్ ఎదురుగా రాజు గారి ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి. అక్కడి నుంచి జిల్లా ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన వాహనాల్లో కౌంటింగ్ హాలు వద్దకు తీసుకుని వస్తారు.
- రాజానగరం వైపు నుంచి వచ్చే వారికి రాజానగరం దుర్గమ్మ గుడి జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో పార్కింగ్ సదుపాయం కల్పించారు.

అధికారులకు..

రాజమహేంద్రవరం, రాజానగరం నుంచి వచ్చే కౌంటింగ్ అధికారులు, సిబ్బంది తమ వాహనాలను గైట్ కాలేజీ గ్రౌండ్‌లో పార్క్ చేసి, అక్కడి నుంచి ఎన్నికల అధికారి ఏర్పాటు చేసిన బస్సుల్లో కౌంటింగ్ హాలు వద్దకు చేరుకోవాలి.

- మీడియా ప్రతినిధులకు గైట్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నన్నయ వర్సిటీలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌కు బస్సుల్లో వెళ్లాలి.
- రాజానగరం, రాజమహేంద్రవరం నుంచి వచ్చే రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, అభ్యర్థులు, చీఫ్ ఎలక్షన్ ఏజెంట్లు తమ వాహనాలను నన్నయ యూనివర్సిటీ మెయిన్ గేట్ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పార్క్ చేసుకోవాలి.
- రాజానగరం, రాజమహేంద్రవరం వైపు వచ్చే పోలీసు, ఇతర శాఖల అధికారులు తమ వాహనాలను గణపతి సచ్చిదానంద గురుదత్త ఆశ్రమంలోని ఖాళీ స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.
- ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గన్ మెన్‌లు నన్నయ వర్సిటీ గ్రౌండ్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన టెంట్‌లో కూర్చోవాలి. ఆయుధాలతో కౌంటింగ్ హాలు వద్దకు వెళ్లకూడదు.

వాహనాల మళ్లింపు

ఓట్ల లెక్కింపు దృష్ట్యా ఈ నెల 4వ తేదీ తెల్లవారుజామున 4 గంటల నుంచి నన్నయ వర్సిటీ మీదుగా వచ్చే వాహనాలను దారి మళ్లించారు.

- హైదరాబాద్, విజయవాడ వైపు నుంచి విశాఖపట్నం వెళ్లే వాహనాలు కొవ్వూరు మీదుగా కొంతమూరు వద్ద హైవే నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కిందకు దిగి, ఎయిర్‌పోర్టు, బూరుగుపూడి, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిసాల, జగ్గంపేట మీదుగా 16వ నంబర్ జాతీయ రహదారి పైకి వెళ్లాలి.
- రావులపాలెం నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే వాహనాలు లాలాచెరువు, దివాన్ చెరువు జీరో పాయింట్ మీదుగా కొంతమూరు వద్ద హైవే నుంచి సర్వీస్ రోడ్డు మీదుగా కిందకు దిగి, బూరుగుపూడి, కోరుకొండ, గోకవరం, కొత్తపల్లి, మల్లిసాల, జగ్గంపేట మీదుగా 16వ నంబర్ జాతీయ రహదారి పైకి వెళ్లాలి.
- రాజమహేంద్రవరం నుంచి కాకినాడ వైపు వెళ్లే వాహనాలను వేమగిరి, కడియం, ద్వారపూడి మీదుగా మళ్లించారు.
- కాకినాడ నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే వాహనాలను సామర్లకోట, బిక్కవోలు, ద్వారపూడి, కడియం, వేమగిరి మీదుగా మళ్లించారు.
- విజయవాడ నుంచి విశాఖపట్నం వైపు వెళ్లే భారీ వాహనాలను దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో ఉదయం 4 గంటల నుంచి తిరిగి ఉత్తర్వులు వచ్చేంత వరకూ నిలిపివేస్తారు.

జిల్లా వ్యాప్తంగా నిఘా

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఓట్ల లెక్కింపు నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా లైవ్ స్ట్రీమింగ్ డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని ఎస్పీ పి.జగదీష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌంటింగ్ కేంద్రాల చుట్టుపక్కల మొత్తం సీసీ కెమెరాలు, రూఫ్ టాప్ బందోబస్తు, మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా సీఆర్‌పీసీ 144 సెక్షన్, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు గుమిగూడి ఉండరాదని తెలిపారు. కౌటింగ్ కేంద్రాల పరిసరాలను బాంబ్ డిస్పోజల్ బృందాలతో అనుక్షణం తనిఖీలు చేస్తున్నామని పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యేంత వరకూ రాష్ట్రవ్యాప్తంగా బాణసంచా విక్రయాలు, తయారీ, కాల్చడం వంటివి నిషేధించారని తెలిపారు. ఫలితాలు వెల్లడైన తరువాత ఎటువంటి అల్లర్లూ చెలరేగకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సిందిగా పోలీసు అధికారులను ఆదేశించామన్నారు. పెట్రోలింగు నిర్వహించాలని, ముందుగా గుర్తించిన సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా పెట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు ఎస్పీ జగదీష్ తెలిపారు.

గలగలా గోదారి



తూర్పు డెల్టా కాలువకు విడుదలవుతున్న గోదావరి జలాలు

- ఖరీఫ్‌కు సాగునీరు విడుదల
- గేట్ల స్విచ్ ఆన్ చేసి నీటిని వదిలిన కలెక్టర్
- రైతులు సకాలంలో నాట్లు వేసుకోవాలని సూచన



గోదారమ్మకు పసుపు, కుంకుమ, చీర సమర్పిస్తున్న కలెక్టర్ మాధవీలత

ధవళేశ్వరం: గోదారమ్మ గలగలా కదిలింది. కాటన్ బ్యారేజీ నుంచి పంట చేల వైపు పయనం ఆరంభించింది. ఆరుగాలం రెక్కలు ముక్కలు చేసుకుంటూ.. స్వేదం చిందిస్తూ.. పసిడి పంటలు పండించే అన్నదాతలకు తోడుగా నిలవాలని.. పరవళ్లు తొక్కుతూ ఉరకలెత్తింది. డెల్టాలో ఖరీఫ్ పంటల సాగుకు ధవళేశ్వరంలోని సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ నుంచి నీటిని విడుదల చేసిన వేళ.. ఈ అపురూప దృశ్యం ఆవిష్కృతమైంది. జిల్లా కలెక్టర్ కె.మాధవీలత బ్యారేజ్ గేట్ల స్విచ్ ఆన్ చేసి గోదావరి డెల్టా కాలువలకు శనివారం నీటిని విడుదల చేశారు. తొలుత గోదావరి మాతకు ఆమె శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాధవీలత మాట్లాడుతూ, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లోని తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాల పరిధిలో 10,13,161 ఎకరాలకు కాటన్ బ్యారేజీ నుంచి సాగునీరు అందిస్తున్నామన్నారు. రైతులు సకాలంలో నాట్లు వేసుకోవాలని సూచించారు.



తూర్పు డెల్టా కాలువకు నీరు విడుదల చేస్తున్న కలెక్టర్

ఖరీఫ్ త్వరగా ప్రారంభించడం ద్వారా ప్రకృతి విపత్తులు, తుపానులు, వరదల ముంపు బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చని చెప్పారు. దీనివలన పంట దిగుబడులు రైతుల చేతికి అందుతాయన్నారు. ఖరీఫ్ సకాలంలో పూర్తి చేయడం ద్వారా రబీ త్వరగా ప్రారంభించడానికి అవకాశం ఉంటుందని, తద్వారా ఆ సీజన్‌లో కూడా సాగుకు పూర్తి స్థాయిలో నీరు అందుతుందని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకునే జూన్ 1న డెల్టా కాలువలకు నీటిని విడుదల చేశామని చెప్పారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఖరీఫ్ సాగు సకాలంలో ప్రారంభించేలా వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో సూచనలు ఇవ్వాలని కలెక్టర్ మాధవీలత ఆదేశించారు. ఈసారి రబీ సీజన్ ముగిసిన 21 రోజుల అనంతరం ఖరీఫ్‌కు నీటిని విడుదల చేశారు. తొలి రోజున డెల్టా కాలువలకు మొత్తం 2,500 క్యూసెక్కుల నీటిని వదిలారు. తూర్పు డెల్టాకు 500, మధ్య డెల్టాకు 500, పశ్చిమ డెల్టాకు 1,500 క్యూసెక్కుల చొప్పున విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.90 అడుగులుగా నమోదైంది. బ్యారేజీ నుంచి సాయంత్రం 3,197 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. కార్యక్రమంలో గోదావరి డెల్టా సిస్టం చీఫ్ ఇంజినీర్ ఆర్.సతీష్ కుమార్, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాస్, ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, ఏఈ అద్దంకి సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

మోగిన కళాశాల గంట

- ఇంటర్మీడియెట్ నూతన విద్యా సంవత్సరం ప్రారంభం
- తెరచుకున్న జూనియర్ కళాశాలలు
- ప్రారంభమైన తరగతులు



కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియెట్ నూతన విద్యా సంవత్సరం ప్రారంభమైంది. రెండు నెలల విరామం అనంతరం జూనియర్ కళాశాలలు శనివారం తెరచుకున్నాయి. ఇంటర్ విద్యార్థులు కళాశాలల బాట పట్టారు. పదో తరగతి పూర్తి చేసుకుని, ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరిన, ఫస్టియర్ నుంచి సెకండియర్‌కు ప్రమోట్ అయిన విద్యార్థులతో కళాశాలలు కోలాహలంగా మారాయి. ఈ ఏడాది ఇంటర్ మొదటి సంవత్సరానికి మొదటి విడత ప్రవేశాలు ఇప్పటికే పూర్తయ్యాయి. రెండో విడత ఈ నెల 15వ తేదీ వరకూ జరగనున్నాయి. ప్రభుత్వ కళాశాలల్లో చేరాలని విద్యార్థులకు పిలుపునిస్తూ జూనియర్ కాలేజీల అధ్యాపకులు స్పెషల్ డ్రైవ్ కూడా నిర్వహించారు. నాడు – నేడు కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం జూనియర్ కళాశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించింది. ప్రతి కళాశాలలో సౌకర్యవంతమైన తరగతి గదులు, ల్యాబ్‌లు, మంచినీరు, మరుగుదొడ్ల వంటి సదుపాయాలు పూర్తి స్థాయిలో సమకూర్చారు. జిల్లావ్యాప్తంగా 137 జూనియర్ కళాశాలలున్నాయి. వీటిల్లో 21,304 మంది విద్యార్థులు ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. వీరితో పాటు ఇప్పటికే ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు జనరల్, వృత్తి విద్యా కోర్సులలో అధ్యాపకులు తరగతులు ప్రారంభించారు. సాధారణంగా ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 వరకూ, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కళాశాలలు పని చేస్తాయి. అయితే కొన్ని కళాశాలలు ఆప్షనల్‌గా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకూ నిర్వహిస్తున్నారు.

జిల్లాలో కళాశాలల వివరాలు

యాజమాన్యం	కళాశాలల సంఖ్య	సెకండియర్ విద్యార్థులు
ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	16	2,848
ప్రైవేటు ఎయిడెడ్ కళాశాలలు	2	142
సాంఘిక సంక్షేమ కళాశాలలు	6	381
హైస్కూల్ ప్లస్	15	347
ప్రైవేటు కళాశాలలు	98	17,586

అన్ని సౌకర్యాలూ కల్పించాం



ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం తరగతులు ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు తరగతి గదిలో అన్ని సౌకర్యాలూ కల్పించాం. అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది తొలి రోజు పూర్తి స్థాయిలో విధులకు హాజరయ్యారు. కళాశాలల్లో అడ్మిషన్లకు ఇబ్బందులు పడుతున్నా, అసౌకర్యాలకు గురవుతున్నా విద్యార్థులు వెంటనే ఇంటర్మీడియెట్ బోర్డ్ ప్రాంతీయ అధికారి (ఆర్‌ఐఓ) కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు.

– ఎన్ఎస్ఎల్‌వీ నరసింహం, ఆర్ఐఓ, ఇంటర్ బోర్డు, రాజమహేంద్రవరం

ధరణీనాయక గోవిందా..

- కిక్కిరిసిన వాడపల్లి ఆలయం
- ఒక్కరోజే రూ.33.28 లక్షల ఆదాయం





ఆలయం వద్ద ప్రదక్షిణ చేస్తున్న భక్తులు, ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామివారు

ఆత్రేయపురం: దినకర తేజా గోవిందా.. ధరణీనాయక గోవిందా.. నామస్మరణ కోనసీమ తిరుపతి వాడపల్లి క్షేత్రంలో మార్మోగింది.. అశేష భక్తజనం ఆ స్వామిని కొలుస్తూ తన్మయత్వం చెందింది.. వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. ఉదయం స్వామివారిని ప్రత్యేక పుష్పాలతో అర్చకులు అలంకరించారు. అనంతరం దర్శన భాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు గౌతమీ గోదావరి నదిలో స్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుని, మొక్కులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణలో వేంచేసి ఉన్న క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులు అధిక సంఖ్యలో రావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. దేవదాయ ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఎం.విజయరాజు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ ఏర్పాట్లను డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. ఈఓ భూపతిరాజు మాట్లాడుతూ స్వామివారి ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాదం విక్రయం, ఆన్‌లైన్ సేవల ద్వారా సుమారు రూ.33,28,574 ఆదాయం సమకూరిందన్నారు. ఆలయం వద్ద ఏర్పాటైన అన్నసమారాధనలో వేలాది మంది భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయం వద్ద ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

క్లుప్తంగా

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం


వెంకటరెడ్డి (ఫైల్)

అనపర్తి: రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందినట్లు సామర్లకోట జీఆర్పీ ఎస్సై లోవరాజు తెలిపారు. అనపర్తికి చెందిన గొలుగూరి వెంకట రెడ్డి (58) స్థానికంగా ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తున్నాడు. శనివారం సొంత పనిపై రైల్వే గేటు అవతలి వైపునకు వెళ్లి వెంకట రెడ్డి తిరిగి వస్తూ రైలు పట్టాలు దాటుతుండగా ఖరగ్‌పూర్ వెళ్లే స్పెషల్ రైలు ఢీకొంది. దీంతో అతను మృతి చెందాడు.

ఐసెట్‌లో ఆదిత్య డిగ్రీ విద్యార్థుల హవా


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ సుగుణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఏపీ ఐసెట్- 2024 ఫలితాల్లో ఆదిత్య డిగ్రీ కళాశాలల విద్యార్థులు బి.కార్తీక్ రాష్ట్ర స్థాయి 2వ ర్యాంకు, ఎస్.దశరథ రామరెడ్డి 6వ ర్యాంకు, అనుపమ 8వ ర్యాంకు సాధించారని ఆ విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్.సుగుణ తెలిపారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఉన్న ఆదిత్య డిగ్రీ కళాశాలలో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. తమ విద్యార్థులు 10 లోపు మూడు, 100 లోపు 22, వెయ్యి లోపు 95 ర్యాంకులు సాధించారన్నారు. ఎల్.యశ్వంత్ సాయిరామ్ కుమార్ 19, కె.నాగదుర్గా ప్రసాద్‌కు 27, ఎ.తరుణ్ ఆదిత్య శ్రీవర్ధన్‌కు 28, బి.శ్రీకాంత్‌కు 33, కేడీఎస్ నిఖితకు 39, సీహెచ్ దేవి శైలజకు 43, కె.శ్రీసాయి వినయ్‌కు 58, ఎస్.నితిన్‌సాగర్‌కు 62, పీవీఎల్ దివ్యకు 63, ఎ.ఐజాక్ బాబుకు 64, కె.లక్ష్మీప్రసన్నకు 69, ఎ.మానసప్రియకు 71, వి.ధరణికి 73, బి.నయనకు 74 ర్యాంకు వచ్చిందని వివరించారు. ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి మాట్లాడుతూ ర్యాంకులతో పాటు క్యాంపస్ ఇంటర్వ్యూల ద్వారా 52 ఎంఎన్‌సీల్లో తమ విద్యార్థులు 140 పైగా ఉద్యోగాలు సాధించారన్నారు. సమావేశంలో ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్ఎన్ రెహమాన్, అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

400 లొకేషన్లలో బీఎస్ఎన్ఎల్ 4జీ సేవలు

- సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం


మాట్లాడుతున్న బీఎస్ఎన్ఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ శేషాచలం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అర్బన్ ప్రాంతాల్లో ఫేజ్ 9.2లో భాగంగా 400 లొకేషన్లలో 4జీ సేవలు అందుబాటులోకి రానున్నాయని బీఎస్ఎన్ఎల్ ఏపీ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎం.శేషాచలం వెల్లడించారు. దేశవ్యాప్తంగా 20 వేల టవర్లు వేసే క్రమంలో ఏపీ సర్కిల్‌లోని మారుమూల ప్రాంతాల్లో 1,350 టవర్లు వేయనున్నామని అన్నారు. అంత్యోదయ మిషన్‌లో వెయ్యి టవర్లు వేశామని ఆయన తెలిపారు. రాజమహేంద్రవరం గోకవరం బస్టాండ్‌లోని నన్నయ సంచార్ భవన్‌లో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 17 వేల గ్రామాలకు గాను అసలు నెట్‌వర్క్ లేని 3,800 గ్రామాల్లో సేవలు అందించడానికి ప్రణాళిక చేశామన్నారు. బీఎస్ఎన్ఎల్ 4జీ సేవల్లో భాగంగా ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రధాన మంత్రి అంత్యోదయ పథకంలో 400 టవర్లు ఏజెన్సీ ప్రాంతాల్లో మరికొద్ది రోజుల్లో అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అన్నీ కాపర్ ఆధారిత సర్వీసులను ఫైబర్ టెక్నాలజీలోకి మార్చడానికి టెలికాం ఇన్ఫ్రా ప్రొవైడర్స్‌ను ఎన్‌రోల్ చేసుకుని, వారి ద్వారా అతి త్వరలో మార్చనున్నట్లు ఆయన చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆదాయం 2023–24 ఆర్థిక సంవత్సరంలో రూ.850 కోట్లు వచ్చిందని ఆయన చెబుతూ, ఇది గత ఆర్థిక సంవత్సరం కంటే రూ.150 కోట్లు అధికమని చెప్పారు. 4జీ టెక్నాలజీతో బీఎస్ఎన్ఎల్ వినియోగదారులకు మరిన్ని సేవలు అందించడానికి కసరత్తు చేస్తుందన్నారు. జనరల్ మేనేజర్ (మొబైల్) ఎ.శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ పి.రాజు, డీజీఎంలు రాజశేఖర్ బాబు, నాగరాజు, సత్యనారాయణ, ఏజీఎంలు బమ్మిడి శ్రీనివాస్, శారదాదేవి, బీఎస్ఎన్ఎల్ పీఆర్ఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఆర్డీగా నాగ నరసింహారావు



రాజమహేంద్రవరం సిటీ: పుర పరిపాలనా శాఖ ప్రాంతీయ సంచాలకుడి (మున్సిపల్ ఆర్డీ)గా కాకినాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్, రాష్ట్ర మున్సిపల్ కమిషనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు సీహెచ్ నాగ నరసింహారావు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాజమహేంద్రవరం మున్సిపల్ రీజినల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుత ఆర్డీ ఎస్‌వీవీ సత్యనారాయణ ఉద్యోగ విరమణ పొందడంతో ఆయన స్థానంలో నాగ నరసింహారావును పూర్తి అదనపు బాధ్యతలతో ఆర్డీగా నియమించారు. ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందుకున్న ఆయన శనివారం రాజమహేంద్రవరంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నాగ నరసింహారావు మాట్లాడుతూ పురపాలక సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఆయన్ని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కమిషనర్ల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.బాలస్వామి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.ఏసుబాబు, ఆర్డీ కార్యాలయ అధికారులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే కేసులే..

- ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద పటిష్ట చర్యలు
- విజయోత్సవాలు, ర్యాలీలకు అనుమతుల్లేవు
- ఏలూరు రేంజ్ శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి రవిప్రకాష్


అమలాపురంలో విలేకర్లతో మాట్లాడుతున్న ఐజీ రవిప్రకాష్, చిత్రంలో జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని జిల్లాల్లో ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా జరిగేలా పోలీసులకు ప్రజలు సహకరించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఐజీ, ఏలూరు రేంజ్ శాంతి భద్రతల పర్యవేక్షణ ప్రత్యేక అధికారి ఎం.రవిప్రకాష్ విజ్ఞప్తి చేశారు. శనివారం సాయంత్రం అమలాపురంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్‌తో కలిసి రవిప్రకాష్ మాట్లాడారు. రేంజ్ పరిధిలో ఒక్క కృష్ణా జిల్లా పెనమలూరు నియోజకవర్గంలో మినహా మిగిలిన చోట్ల పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు. ఓట్ల లెక్కింపు కూడా అంతే ప్రశాంతంగా జరిగేందుకు ఆయా జిల్లాల పోలీస్ శాఖలు సకల బందోబస్తు ఏర్పాట్లు చేశాయని ఐజీ వెల్లడించారు. ఓట్ల లెక్కింపు సందర్భంగా నిబంధనలు అతిక్రమిస్తే పోలీసు కేసులు తప్పవని, తద్వారా భవిష్యత్‌ను పాడు చేసుకోవద్దని హితవు పలికారు. ఓట్ల లెక్కింపు రోజున ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలకు అనుమతుల్లేవని స్పష్టం చేశారు.

క్యూఆర్ టీమ్‌ల ఏర్పాటు

రేంజ్‌లోని కృష్ణా, పశ్చిమ, తూర్పు గోదావరి ఉమ్మడి జిల్లాల పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో హింసాత్మక సంఘటనలను తక్షణమే అదుపు చేసేందుకు కొత్తగా క్విక్ రియాక్షన్ (క్యూఆర్) టీమ్‌లను ఏర్పాటు చేశామని రవిప్రకాష్ తెలిపారు. ఏ గ్రామంలోనైనా ఘర్షణ లేదా వివాదం జరిగిన వెంటనే అదుపు చేసేందుకు క్యూఆర్ టీమ్‌లు సంసిద్ధమై ఉంటాయని చెప్పారు. సంఘటన జరిగిన ఐదు నుంచి పది నిమిషాల్లో సంఘటనా స్థలంలో ఉండేలా క్యూఆర్ టీమ్‌లు పనిచేస్తాయని స్పష్టం చేశారు. కాకినాడ జిల్లాలో పిఠాపురం, పశ్చిమ గోదావరి జిల్లాలో దెందులూరు, కృష్ణా జిల్లాలో నూజివీడు, గన్నవరం, పెనమలూరు తదితర నియోజకవర్గాల్లో పోలీసు బందోబస్తుపరంగా ప్రత్యేక దృష్టి పెట్టామని వివరించారు.

ప్రతి జిల్లా ఇన్‌చార్జిగా ఎస్పీ

ప్రతి జిల్లా ఓట్ల లెక్కింపు కేంద్రానికి ఆ జిల్లా ఎస్పీ ఇన్‌చార్జిగా ఉండి బందోబస్తును పర్యవేక్షిస్తారని రవిప్రకాష్ అన్నారు. పోలీసు బలగాల కంపెనీలు, పార్టీలు, టీమ్‌లకు ఓ సీఐ, ఎస్సైలు ఇన్‌చార్జులుగా ఉండి వాటిని నిర్వహిస్తారని చెప్పారు. జిల్లా ఎస్పీ కార్యాలయం నుంచే ఐజీ రవిప్రకాష్ రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం ఐజీ రవిప్రకాష్ జిల్లా ఎస్పీ శ్రీధర్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, స్పెషల్ బ్రాంచి సీఐలతో జిల్లాలో ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.

ప్రతి జిల్లాలో ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద కేంద్ర బలగాలు, జిల్లా ఆర్మ్‌డ్ బలగాలు, జిల్లా పోలీసు యంత్రాంగంతో మూడంచెల బందోబస్తును పకడ్బందీగా ఏర్పాటు చేశామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి వచ్చే ఏజెంట్లు, రాజకీయ పార్టీల అభ్యర్థులను నఖశిఖ పర్యంతం తనిఖీలు చేసిన తర్వాతే తగిన ధ్రువీకరణ పత్రాలతో లోనికి అనుమతిస్తామన్నారు. ఓట్ల లెక్కింపు కేంద్రాల వద్ద రెడ్ జోన్లు, నో ఫ్లయింగ్ జోన్లు, నో మెన్, నో వెహికల్ జోన్లు ఏర్పాటు చేశామన్నారు. ఇవి కాకుండా ఓట్ల లెక్కింపు సమయాల్లో, అభ్యర్థుల గెలుపు, ఓటముల దృష్ట్యా అనివార్యమయ్యే ఘర్షణలు, విబేధాలపై పోలీసు నిఘా విస్తృతంగా ఉంటుందని వివరించారు.

అందరిచూపు టి-20 వరల్డ్ కప్ పైనే..


డాక్టర్ శివ కుమార్

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రికెట్ క్రీడాకారులను భారత్‌లో దేవుళ్లతో సమానంగా చూస్తారు. 130 కోట్ల మంది భారతీయుల ఆశల తగ్గట్టుగా భారత్ జట్టు ఈ నెల 2వ తేదీ ఆదివారం నుంచి అమెరికాలో టి–20 వరల్డ్ కప్ ఆడనుంది. యువ క్రికెటర్లతో మంచి ఫామ్‌లో ఉన్న మన జట్టు టి–20 వరల్డ్ కప్‌ను గెలుచుకుని అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపుతుందా లేదా అనే దానిపై ప్రతి ఒక్కరిలో ఉత్కంఠ నెలకొంది. యూఎస్‌లో ఆదివారం నుంచి ప్రారంభం కానున్న టి–20 వరల్డ్ కప్‌లో భారత జట్టు విజయ సాధ్యాసాధ్యాలపై 'సాక్షి'తో జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు డాక్టర్ శివకుమార్ మాట్లాడారు. టి–20 వరల్డ్ కప్‌లో జట్టు సగటు స్కోర్ 170–180 నమోదు చేస్తుందని భావిస్తున్నట్లు తెలిపారు. సెమీ ఫైనల్స్‌కు ఇండియా, వెస్టిండీస్, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా చేరుకోవచ్చని శివ కుమార్ అన్నారు. ఈ వరల్డ్ కప్‌లో మ్యాచ్ ఆఫ్ ది సిరీస్‌గా విరాట్ కోహ్లి, మిచెల్ స్టార్క్, రోహిత్ శర్మ నిలుస్తారని అనుకుంటానన్నారు. ఈ కప్‌ను కైవశం చేసుకునే అవకాశాలు ఎక్కువగా ఇండియా, వెస్టిండీస్, ఆస్ట్రేలియాలకు ఉందన్నారు.

పంట కాలువలో వృద్ధుడి మృతదేహం


వృద్ధుడి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామకృష్ణ

కరప: నడకుదురు సమీపంలోని పంట కాలువలో గుర్తుతెలియని వృద్ధుడి మృతదేహం లభ్యమైంది. కరప ఎస్ఐ టి.రామకృష్ణ కథనం ప్రకారం.. కరప మండలం నడకుదురు శివారున పంట కాలువలో ఓ వృద్ధుడి మృతదేహం ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. అతని వయసు సుమారు 60 నుంచి 70 ఏళ్ల మధ్యలో ఉంటుందని, చేపలు వేటాడుతూ ప్రమాదవశాత్తూ కాలుజారి కాలువలో పడి మృతిచెంది ఉండొచ్చని భావిస్తున్నారు. సదరు వ్యక్తి వివరాలు ఎవరికైనా తెలిస్తే కరప పోలీస్ స్టేషన్ నంబర్ 0884 2394833, ఎస్ఐ నంబర్ 94407 96557లకు సమాచారం అందించాలని ఎస్ఐ రామకృష్ణ కోరారు. మృతదేహాన్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రిలోని మార్చురీకి తరలించారు.

సత్యదేవుని రథానికి రక్షణ



సాక్షి దినపత్రికలో గురువారం వచ్చిన కథనం


ఎండ, వానల నుంచి రక్షణకు టేకు రథంపై కప్పిన టార్పాలిన్

- టార్పాలిన్, సీసీ కెమెరాల ఏర్పాటు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను ఊరేగించేందుకు రూ.1.08 కోట్లతో తయారు చేయించిన 36 అడుగుల టేకు రథానికి అధికారులు రక్షణ ఏర్పాట్లు చేపట్టారు. శనివారం ఆ రథానికి టార్పాలిన్ కప్పడంతో పాటు ఆ రథం వద్దకు ఎవరూ వెళ్లకుండా చుట్టూ ఫెన్సింగ్ వేశారు. అదే విధంగా రథం చుట్టూ సీసీ టీవీ కెమెరాలు అమర్చారు. సత్యదేవుని దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా గత నెల 22న ఈ రథంపై గ్రామంలో సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారిని ఘనంగా ఊరేగించారు. అనంతరం ఆ రథాన్ని పంపా సత్రంలో ఉంచి ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టలేదు. అది ఎండకు ఎండి, వానకు తడుస్తుండడంతో గురువారం 'సాక్షి' దినపత్రికలో 'తేరుకు రక్షణ ఈ తీరునా' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన ఈఓ కె.రామచంద్రమోహన్ రథంపై వెంటనే రక్షణ ఏర్పాట్లు చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో టార్పాలిన్‌తోపాటు రథం చుట్టూ ఫెన్సింగ్, అక్కడ సీసీ టీవీ కెమెరాలు అమర్చారు. కాగా, త్వరలో జరిగే దేవస్థానం ట్రస్ట్ బోర్డు సమావేశంలో రథానికి శాశ్వతంగా షెడ్డు నిర్మించేందుకు స్థలం ఖరారు చేసి, పనులకు టెండర్లు పిలుస్తామని డీఈఈ ఉదయ్ తెలిపారు.


రథం సమీపంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

దారి కాచి.. దోపిడీ చేసి..

- వ్యసనాలకు బానిసై చోరీలు
- చివరికి పోలీసులకు చిక్కిన నిందితులు


నిందితులను చూపుతూ వివరాలను వెల్లడిస్తున్న సీఐ దొరరాజు, ఎస్సై సురేష్‌బాబు

రామచంద్రపురం: దారి కాచి కత్తులతో బెదిరిస్తూ దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు రామచంద్రపురం సీఐ పి.దొరరాజు తెలిపారు. ఈ మేరకు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎస్సై కె.సురేష్‌బాబుతో కలసి ఆయన శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆ వివరాల ప్రకారం.. కొత్తూరుకు చెందిన గంగ్రోతు వీరకిశోర్ గత నెల 30 రాత్రి 10.30 గంటల సమయంలో తన బైక్‌పై ఇంటికి వెళుతుండగా నలుగురు అతన్ని నిలువరించారు. కత్తులతో బెదిరించి బలవంతంగా అతని నుంచి రూ.2 వేలు, బంగారు ఉంగరాన్ని లాక్కొని పరారయ్యారు. ఈ మేరకు వీరకిశోర్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. కేసును త్వరితగతిన ఛేదించేందుకు జిల్లా ఎస్పీ శ్రీధర్, అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్ బాషా ఆదేశాల మేరకు డీఎస్పీ బి.రామకృష్ణ పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సీఐ దొరరాజు తెలిపారు. నిందితుల్లో పట్టణ రాజబాబునగర్‌కు చెందిన గంపల విజయశేఖర్ (పండు)పై 7 క్రిమినల్ కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉందన్నారు. అతనితో పాటు ముగ్గురు బృందంగా ఏర్పడి సులువుగా డబ్బులు సంపాదించాలనే ఆశతో దారిన పోయే వారిని చాకులు, మారణాయుధాలు చూపించి బెదిరిస్తూ నగదు, విలువైన వస్తువులను లాగేసుకుని దారి దోపిడీలకు పాల్పడుతున్నారని సీఐ తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 30 స్థానిక బార్‌లో మద్యం తాగి చోడవరం బైపాస్‌లో కొత్తూరు జంక్షన్‌కు దగ్గరలో చీకట్లో ఆగి పలువురిని బెదిరించి నగదుతో పాటు బంగారు ఆభరణాలను కూడా దోచుకున్నారన్నారు. అప్పుడే వీర కిశోర్ నుంచి కూడా నగదు, బంగారు ఉంగరాన్ని లాక్కున్నట్లు చెప్పారు. కాగా ఒక కారును కూడా ఆపి కత్తులతో బెదిరించి నగదును లాక్కోగా, ఇంకా ఏమైనా విలువైన వస్తువులు ఉన్నాయని బెదిరించగా అతను భయంతో కారును స్పీడ్‌గా పోనివ్వగా మోటార్ సైకిళ్లపై నిందితులు వెంబడించారని వివరించారు. తిరిగి దోపిడీలు చేసేందుకు వైఎస్సార్ నగర్‌లోని రైల్వే స్టేషన్ వద్ద కూర్చుని ప్రణాళికలు వేస్తుండగా ముగ్గురిని అదుపులోకి తీసుకున్నామన్నారు. గంపల విజయశేఖర్ (పండు)తో పాటు రాజబాబునగర్‌కు చెందిన తుమ్మలపల్లి లేమేకు అంబ్రోస్ అలియాస్ నాని, తాతపూడి చిన్నిలను అరెస్ట్ చేయగా మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరి నుంచి నగదుతో పాటు నేరాలకు ఉపయోగించిన చాకులు, బైక్‌ను సీజ్ చేశామని, నిందితులను కోర్టుకు తరలించామన్నారు. కేసును ఛేదించిన డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ పి.దొరరాజు, ఎస్సై కె.సురేష్‌బాబు, వారి సిబ్బందిని ఎస్పీ శ్రీధర్ అభినందించారు.